## పుష్కర పనులు ఎప్పుడు మొదలు పెడతారో... నిధులు ఇచ్చేది ఎప్పుడు...
# ఊరు బాగుపడేది ఎన్నడు...?

నరసాపురం ప్రభాతవార్త : నరసాపురం పట్టణం సమస్యల పుట్టలా ఉంది. టన్నుల కొద్దీ చెత్త రోడ్లపై కనబడుతోంది. కానీ ప్రజాప్రతినిధులు అధికారులు ఏమీ చేయలేని పరిస్థితి. పుష్కరకాలం దగ్గర పడుతుంది. వేసవి మరో మూడు నెలలు మాత్రమే ఉంటుంది. జూన్ నుంచి వర్షాలు మొదలవుతాయి. పుష్కరాల పనులు ప్రారంభించే అవకాశం కానీ మంజూరైన నిధులు ప్రణాళిక గాని కనబడడం లేదు. పుష్కరాల కన్నా ముందే పోలవరం పూర్తి చేస్తామని ప్రభుత్వం చెబుతోంది. గోదావరి ప్రాంతం ఉన్న పట్టణాల్లో పుష్కర శోభ కనబడాలంటే పనులు ఇ ప్పటినుంచి ప్రారంభించక తప్పదు. కానీ ఆ జాడ మాత్రం నరసాపురంలో ఎక్కడా కనబడడం లేదు. గోదావరి వశిష్ట నది రేవులలో గాని దేవాలయాల్లో కానీ కనీసం మున్సిపల్ రోడ్లపై గాని ఎక్కడ నిధుల నీడ లేదు. ఈ పట్టణంలో 95% రోడ్లు డ్రైన్లు సర్వనాశనమై కనబడుతున్నాయి. ఇక చెత్త గురించి ఆవులు గురించి చెప్పనవసరం లేదు. పుష్కరాలను మహాకుంభమేళాగా చేద్దామని గొప్ప సంకల్పం ప్రజాప్రతినిధుల్లో ఉన్న నిధులు మాత్రం ఆ దిశగా కనబడడం లేదు. నరసాపురం వంటి నియోజకవర్గానికి పుష్కరాలు తప్ప నిధులు ఇచ్చే వచ్చే మార్గం కూడా లేదు. కూటమి ప్రభుత్వం ఇప్పటికైనా నిధులు మంజూరు చేసి గోతులు గొప్పలతో నరకం కన్నా దారుణంగా ఉన్న వీధులను చెత్తను మరమ్మత్తు చేస్తారని ప్రజలు ఆశిస్తున్నారు.



## రంజాన్ రోజున కూడా ఇంటి పన్నులు కట్టవచ్చు

భీమవరం టౌన్ మార్చి 20 : ప్రభాతవార్త : భీమవరం పట్టణ పరిధిలోని ఇంటి పన్నులు, ఖాళీ స్థలాల పన్నులు, కొళాయి బిల్లులు రంజాన్ పండుగ రోజున మరియు ఆది వారం (21,22 తేదీల్లో ) కూడా చెల్లించవ చ్చునని భీమవరం మున్సిపల్ కమిషనర్ తెలియజేస్తున్నారు. అంతేగాక మార్చి 16వ తేదీ నుండి ఇంటి పన్నులు, ఖాళీ స్థలాల పన్నులు పై వడ్డీ 50% రాయితీ కల్పించి నట్లు ఆయన వెల్లడించారు. ఈ సౌకర్యాన్ని ప్రజలు వినియోగించుకుని 50 శాతం రాయితీ వడ్డీ మాఫీ పొంది ఇంటి పన్నులు ఖాళీ స్థలాల పన్నులు, కొళాయి బిల్లులు గడువులోపు చెల్లించాలని విజ్ఞప్తి చేశారు. ఈ ప్రత్యేక పన్ను కట్టించుకో వడానికి ప్రతి రోజు ఉద యం ఎనిమిది గంటల నుండి రాత్రి 8 గంట ల వరకు కౌంటర్లు తెరిచే ఉంటాయని అన్నారు.

## ఈనెల 22వ తేదీన విజయవాడలో శాలివాహన-మొల్ల సాంస్కృతిక వైభవం



పెనుమంట్ర, మార్చి 20, (ప్రభాతవార్త) : భారతీయ జనతా పార్టీ ఆధ్వర్యంలో మార్చి 22న విజయవాడలో "శాలివాహన చక్రవర్తి -- అతుకూరి మొల్ల సాంస్కృతిక వైభవం" కార్యక్రమం నిర్వహించనున్నారు. ఈ కార్యక్రమానికి సంబంధించిన వాల్ పోస్టర్‌ను విడుదల చేశారు. మార్చి 13న మొల్లమాంబ జయంతి, మార్చి 22న శాలివాహన చక్రవర్తి జయంతి సందర్భంగా, భారతీయ జనతా పార్టీ రాష్ట్ర అధ్యక్షులు పీవీఎన్ మాధవ్ నాయకత్వంలో ఈ కార్యక్రమాన్ని బిజెపి ఓబిసి మోర్చా నిర్వహిస్తోంది. విజయవాడలోని వెన్యూ కన్వెన్షన్ హాల్ గ్రౌండ్ వద్ద ఉదయం 8 గంటల నుంచి టెర్రకోట, కుమ్మరి ఉత్పత్తుల ప్రదర్శనలు, సాంస్కృతిక కార్యక్రమాలు జరుగుతాయి. సాయంత్రం 4 గంటలకు మహాసభ నిర్వహించనున్నారు. ఈ మహాసభలో అందరూ పాల్గొని విజయవంతం చేయాలని బిజెపి ఓబిసి మోర్చా పిలుపునిచ్చింది. ఇదిలా ఉంటే ఏకే ఆర్ట్స్ అధినేత కరుణాకర్ వడియార్ ను ఓబీసీ మోర్చా జిల్లా అధ్యక్షుడు శ్రీ గున్నెపల్లి పుల్లాజీ ఈ సమావేశానికి ఆహ్వానం పలికారు

## పాటల పోటీల విజేతలకు బహుమతులు

భీమవరం టౌన్, మార్చి 20 : ప్రభాత వార్త : గోదావరి సాహితీ సాంస్కృతిక వేదిక, సరిగమ సంగీత పరిషత్‌ల సంయుక్త ఆద్వర్యంలో ఉభయ తెలుగు రాష్ట్రాల స్థాయిలో భీమవరంలో పాటల పోటీలు నిర్వహించారు. విజేతలకు ప్రథమ బహుమతిగా 7వేల రూపాయలు, ద్వితియ, తృతీయ బహుమతులుగా 5వేలు, 3వేల రూపాయులు నగదు పురస్కారాలను, జ్ఞాపికలను అందజేశారు. సి. హెచ్ సుబ్బారావు(పెనుగొండ) జి.ఎల్.బి ప్రియాంక (రాజమండ్రి) ఆర్.విజయ్ కుమార్(ఏలూరు) ప్రథమ, ద్వితియ, తృతీయ స్థానాలను కైవసం చేసుకున్నారు. వెయ్యిరూపాయల చొప్పున 5గురికి ప్రత్యేక బహుమతులు, 500రూపాయలు చొప్పున 6గురు ప్రోత్సాహక బహుమ తులను గెల్చుకున్నారు. పాటల పోటీలకు న్యాయనిర్ణేతలగా ఎస్.కోటేశ్వరరావు, వైవి.రమణ, టి.శ్రీనివాసరాజులు వ్యవహరించారు. గోదావరి సాహితీ సాంస్కృతిక వేదిక నూతన కార్యవర్గాన్ని కుమార్ కూనపరాజు ప్రకటించారు. అధ్యక్షులుగా కుమార్ కూనపరాజు, ఉపాధ్యక్షులుగా మంతెన సీతారాం, డాక్టర్ పెంకి విజయ్‌కుమార్, ప్రధాన కార్యదర్శిగా పి.శ్రీనివాసరాజు, కార్యదర్శులుగా గుడిపాటి నర్శింహారావు, చింతపల్లి ప్రసాధరావు, చైతన్యప్రసాద్‌లు మరియు మరో 10మంది సభ్యులతో నూతన కార్యవర్గం ఏర్పడి నట్లు నిర్వాహకులు వెల్లడించారు.

## వివిధ రిజిస్టర్ల అప్డేషన్ పై సమీక్ష



అత్తిలి,మార్చి 20 (ప్రభాత్ వార్త)అత్తిలి మండల పరిషత్ కార్యాలయంలో డ్వామా అసిస్టెంట్ ప్రాజెక్టు డైరెక్టర్ జి వి కే మల్లికార్జున రావు,ఎంపీడీఓ పి.శామ్యూల్ అధ్యక్షతన తణుకు క్లస్టర్ పరిధిలో అప్డేషన్ అఫ్ ఎంసీసీ రిజిస్టర్లు, 2025-26 సంవత్సరం ప్రేపరషన్ అఫ్ వర్క్ ఫైల్స్ సోషల్ ఆడిట్, ఎంసీసీ,డీసీసీ చెల్లింపులు,జనరేషన్ స్టేటస్, గోకులం షెడ్లు తదితర అంశాలపై సమీక్ష సమావేశాన్ని నిర్వహించారు.ఈ సమీక్షలో తణుకు క్లస్టర్ పరిధిలో గల మండలాల ఏ పీ ఓ లు,ఈ సి లు,టెక్నికల్ అసిస్టెంట్లు , బీ ఎఫ్ టి లు, సి ఓ లు తదితరులు పాల్గొన్నారు.

## ప్రజా సంస్కృతిలో ప్రజలందరూ భాగస్వాములు కావాలి : రచయిత్రి కెఎన్ మల్లీశ్వరి

భీమవరం, టౌన్ మార్చి 20 : ప్రభాతవార్త: ప్రజా సంస్కృతిలో ప్రజలందరినీ భాగస్వాములను చేయటం ద్వారా సాంస్కృతిక ఉద్యమాన్ని బలోపేతం చేయగలమని ప్రముఖ రచయిత్రి కే ఎన్ మల్లీశ్వరి అన్నారు. స్థానిక అంబేద్కర్ భవనంలో జరిగిన గోదావరి సాహితీ సాంస్కృతిక వేదిక కార్యక్రమంలో ఆమె పాల్గొని మాట్లాడారు. ఆధిపత్య సంస్కృతికి ప్రత్యామ్నాయంగా ప్రజా సంస్కృతిని ప్రజ లంతా ప్రోత్సహించాలని సభలో పాల్గొన్న ప్రముఖ సాహితీ విమర్శకులు గుంటూరు లక్ష్మీ నర్సయ్య అన్నారు. సభకు కుమార్ కూనప రాజు అధ్యక్ష తవహించారు. కవి,పాత్రికేయులు ప్రసాదమూర్తి , సాంస్కృతిక ఉద్యమనాయ కులు మంతెన సీతారాం, సినీదర్శకులు, తెలుగు షార్ట్‌ఫిలిమ్స్ అసోషియేషన్ అధ్య క్షులు డి.వి.రాజు, కవి, ప్రజాగాయకులు చైతన్యప్రసాద్, సరిగమ సంగీత పరిషత్ ఆకివీడు అధ్యక్షులు ఎస్.కోటేశ్వరరావు, ఐక్య నేషనల్ ఫెడరేషన్ అధ్యక్షులు ఎం.శివరామ రాజు, నాయకులు చింతపల్లి ప్రసాదరావు, పి.సీతారామరాజులు పాల్గొన్నారు. వేదిక కన్వీనర్ పి.శ్రీనివా సరాజు ఆహ్వానం పలుకగా, డా॥ పెంకి విజయకుమార్ వందన సమర్పనం చేశారు. తరువాత గోదావరి సాహితీ సాంస్కృ తికవేదిక లోగోను లక్ష్మీనర్సయ్య, డాక్టర్ ప్రసాదమూర్తి, మల్లీశ్వరిలు ఆవిష్క రించారు. వేదిక గేయాన్ని చైతన్య ప్రసాద్ ఆలపించారు.

## రక్షిత మంచినీటి ట్యాంకులు శుభ్రం చేయించండి

ప్రభాత వార్త చాట్రాయి : గ్రామాల్లో ఉన్న రక్షిత మంచినీటి పథకాలు సంబంధించిన ట్యాంకులు కనీసం మూడు మాసాలకు ఒక్కసారైనా శుభ్రం చేయించాల్సి ఉండగా గ్రామాల్లో ఆ పరిస్థితి లేకుండా పోయింది. రక్షిత మంచినీటి పథకాలు ట్యాంకుల ద్వారా ప్రజలకు మంచినీటిని అందించాల్సిన అధికారులు పట్టించుకోవటం లేదని పలువురు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. మండలంలో దాదాపుగా అన్ని గ్రామాల్లో ట్యాంకులు ఉన్నప్పటికీ శుభ్రం చేసే కార్యక్రమం మాత్రం జరగటం లేదని చెప్పాలి. ప్రతి మూడు మాసాలకు ఒకసారి క్లోరినేషన్ చేసి ప్రజలకు తాగునీరు అందించాల్సి ఉండగా పట్టించుకునే నాథుడు కరువయ్యారని ప్రజలు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. గ్రామాలలో సరైన తాగునీరు అందించకపోవడం వల్ల ప్రజలు రోగాలు బారిన పడాల్సి వస్తోందని పలువురు వాపోతున్నారు. కొన్ని గ్రామాల్లో రక్షిత మంచినీటి పథకాల ట్యాంకులకు పైకి ఎక్కేందుకు కూడా నిచ్చెనలు లేవని పలువురు తెలియజేస్తున్నారు. ఇప్పటికైనా ఉన్నతాధికారులు స్పందించి రక్షిత మంచినీటి పథకాల ట్యాంకులపై దృష్టి సారించాలని పలువురు కోరుతున్నారు.



## నవోదయకు ఎంపికైన మీనవిల్లూరు విద్యార్థి



అత్తిలి/ పెంటపాడు,మార్చి 20 (ప్రభాత వార్త )నవోదయ ప్రవేశ పరీక్షలో పెంటపాడు మండలంలోని మీనవల్లూరు మోడల్ ప్రైమరీ స్కూల్ విద్యార్థిని తిప్పా వాసవి ప్రియ విజయం సాధించింది. ఈ సందర్భంగా మండల విద్యాశాఖ అధికారులు ఎం. శ్రీనివాస్ టి.వి. రామకృష్ణ విద్యార్థిని దుస్సాలువాతో సత్కరించి అభినందించారు. విద్యార్థిని తల్లిదండ్రులు టీవీఎన్ వినాయకుడు, లలితాంజలి ని ప్రధానోపాధ్యాయులు కె. రామకృష్ణమూర్తి ఉపాధ్యాయులు వి ఎస్ ఎన్ ఎల్ భవాని, కె.కిరణ్ కుమార్, ఎన్.లలితారాణి అభినందించారు.మోడల్ ప్రాథమిక పాఠశాలను మండలంలోని మిగిలిన పాఠశాలలు ఆదర్శంగా తీసుకొని ఇటువంటి ప్రవేశ పరీక్షల్లో విద్యార్థుల చేత రాయించి వారికి మంచి భవిష్యత్తు అందేలా కృషి చేయాలని కోరారు.

## సర్వర్ పనిచేయక ఉపాధి హామీ శ్రామికులు ఇక్కట్లు

వేలేరుపాడు, మార్చి 20 (ప్రభాత వార్త ) : మారుమూల గ్రామాలు,తక్కువ సిగ్నల్ అందె ప్రదేశాలు కావడంతో వేలేరుపాడు మండలంలో గ్రామీణ ఉపాధి హామీ పథకంలో పనిచేస్తున్న కూలీలకు సర్వర్ పని చేయక ఇబ్బంది పడుతున్నట్లు తెలియజేసారు. ఉదయం ఒక ఫోటో మధ్యాహ్నం ఒక ఫోటో దిగాల్సిన పరిస్థితి ఏర్పడుతుందన్నారు.ఫోటోలు తీయటానికి కూడా సర్వర్ పనిచేయట్లేదని వాపోతున్నారు.ఫోటోల కోసం ఎక్కువ సమయం వెచ్చించాల్సి వస్తుందని, పనిచేసినప్పటికీ కూలీ అందుతుందో లేదో అనే సందేహం కలుగుతుందని అన్నారు.కాబట్టి పాత మస్టర్ పద్ధతిలోనే ఉపాధి హామీ పనిని కొనసాగించాలని శ్రామికులకు పని విషయంలో కానీ కూలి విషయంలో కానీ ఇబ్బందులు లేకుండా చూడాలని కోరుచున్నారు. ప్రభుత్వం పొమ్మనకుండా పొగ పెట్టే పద్ధతిలో వ్యవహరిస్తుందని సమస్యలు ఉన్న పనిలో పనిచేయటం కంటే మానేసి ఇంటికాడ ఉండటం మంచిదనే పద్ధతులో కూలీలు ఉ ంటున్నారన్నారు. కానీ రెక్కాడితే కానీ డొక్కాడని పేదలు పనిచేయకుండా ఉండలేరు కదా అన్నారు. ఇప్పటికైనా ప్రభుత్వం ఆలోచించి మస్టర్ పద్ధతిలోనే ఉపాధి హామీ పనిని కొనసాగించాలని ప్రభుత్వాన్ని వేడుకుంటున్నారు.



## ఈదురు గాలులకు పడిన మొక్కజొన్న పంటను పరిశీలన



చాట్రాయి, మార్చి 20,ప్రభాతవార్త మండలం లోని మొక్కజోన్న పంటను చాట్రాయి, చనుబండ గ్రామాల్లో క్షేత్ర స్థాయి లో మండల వ్యవసాయ అధికారి బి. శివశంకర్ శుక్రవారం పరిశీలించారు.ఈ సందర్భంగా అయన మాట్లాడుతూ మండలంలో రబీ సీజన్ కు గాను మొక్కజోన్న 12వేల ఎకరాలలో సాగు చేయడం జరిగిందన్నారు.ఈనెల 18 సాయంత్రం కురిసిన అకాల వర్షం, ఈదురుగాలులకు చాట్రాయి, చనుబండ గ్రామాల్లోని 50 ఎకరాలు వరకు మొక్కజొన్న పంట పడిపోయినట్లు ఆయన తెలిపారు. రైతులు అధిక నీటిని బయటకు కాలువల ద్వారా పంపించి మొక్క జొన్న కర్రలను తేమ తగలకుండా జాగ్రత్తలు తీసుకోవాలని తెలియ చేశారు.మొక్కజొన్న పంట రాబోవు వారం రోజులలో కండేలు పూర్తిగా ఎండే దశకు వస్తున్నవి కావున రైతులు కోతకు సిద్ధంగా ఉండి పంటను కాపాడుకోవాలని సూచించారు.ఎండ తీవ్రత పెరిగేకొద్దీ యూరియా ఎక్కువ వాడినా లేదా నేలలో ఉండే శిలీంద్రాల ద్వారా ఆకు కాండం ఎండు తెగులు వచ్చే అవకాశం ఉన్నది కాబట్టి అజోక్సి స్ట్రోబిన్ 11శాతం మరియు టేబుకోనజోల్ 18.3శాతం ముందును 300 మిల్లీమీటర్లు ఒక ఎకరానికి పిచికారి చేసుకున్న ఎడల ఆకు మరియు కాండం ఎండు తెగులు రాకుండా తగ్గించుకోవచ్చునన్నారు. ఈ కార్యక్రమంలో రైతులు తదితరులు పాల్గొన్నారు.

## బడి పిల్లల భోజనం పై అక్కసు ఎందుకు

భీమవరం టౌన్, మార్చి 20 : ప్రభాతవార్త : పేద పిల్లలకు అందించే మధ్యాహ్నభోజన పథకంపై గరికపాటి నరసింహారావు అహంకారపు అక్కసు వెళ్ళగక్కడాన్ని కేవీపీఎస్ జిల్లా కమిటీ తీవ్రంగా ఖండి స్తుంది. వాఖ్యలను వెనక్కి తీసుకుని, క్షమాపణ చెప్పాలని డిమాండ్ చేస్తుంది. ఈ సందర్భంగా ఆ సంఘం జిల్లా అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులు బత్తుల విజయ కుమార్, కె.క్రాంతి బాబు ఒక ప్రకటన విడుదల చేస్తూ ప్రవచనాల పేరుతో పిల్లలకు అందిస్తున్న మధ్యాహ్న భోజన పథకంపై ఇష్టం వచ్చినట్లు మాట్లాడటం అమాన వీయం. పిల్లలు కేవలం కోడిగుడ్డు కోసమే బడికి వస్తున్నారని, చదువు "మిధ్య" అయిపోయిందని అనడం పేద విద్యార్థుల ఆత్మగౌరవాన్ని దెబ్బతీయడమే. మధ్యాహ్న భోజనం పిల్లలు బడికి వచ్చేందుకు, డ్రాపౌట్ తగ్గేందుకు దోహదపడిందని అనేక అంత ర్జాతీయ అధ్యయనాలు చెబుతున్నాయి. విద్యార్థులను "శోభనం పెళ్లికొడుకు"తో పోల్చడం విద్యార్థి లోకాన్ని కించపరచడం. భారతదేశంలో 84% మంది తల్లులు, పిల్లలు పౌష్టికాహార లోపంతో బాధపడు తున్నారు. కోడిగుడ్డును "గాడిద గుడ్డు" అని సంబోధించడం ఆకలిని కించపరచడం. విద్యార్థులకు భోజనం, పుస్తకాలు, యూని ఫాం అందించడం ప్రభుత్వ బాధ్యత. దానిని "బిచ్చం" అని పిలవడం సిగ్గుచేటు. గరిక పాటి వ్యాఖ్యలు కనీస "విజ్ఞత లేనివి". ఏనాడయిన కార్పోరేట్లకు ఇచ్చే లక్షల కోట్ల రాయితీల గురించి మాట్లాడని గరికపాటి పేద పిల్లలకు అందించే భోజనంపై విషం కక్కటం దుర్మార్గం. గరికపాటి వ్యాఖ్యలు వెంటనే వెనక్కి తీసుకోవాలి. పిల్లలను అవమా నించిన గరికపాటి నరసింహారవు క్షమాపణలు చెప్పాలి.

## సిహెచ్ అగ్రహారంలో ఎన్రోల్మెంట్ డ్రైవ్



అత్తిలి /గణపవరం, మార్చి 20( ప్రభాత వార్త)గణపవరం మండలం సిహెచ్ అగ్రహారం జడ్పీ ఉన్నత పాఠశాల తరపున అంగన్వాడీ టీచర్ శ్రీదేవి ఆధ్వర్యంలో ఉ పాధ్యాయులు బి రమేష్, పి దుర్గభవాని, బి ఎన్ మూర్తి ఎన్రోల్మెంట్ డ్రైవ్ కార్యక్రమాన్ని నిర్వహించారు. ప్రైవేట్ పాఠశాలలకు వెళుతున్నటువంటి విద్యార్థులను కలిసి వివరాలు సేకరించి పాఠశాలలో నమోదు చేసారు. గణపవరం నెంబర్ వన్ పాఠశాల ఆధార్లో కూడా ఎన్రోల్మెంట్ డ్రైవ్ కార్యక్రమాన్ని నిర్వహించారు. ప్రధానోపాధ్యాయుడు ఎం ఎల్ ఎస్ ఎస్ నారాయణ, ఉ పాధ్యాయుడు మద్దాల అర్జునరావు పాల్గొన్నారు. పాఠశాల లో ప్రభుత్వం అందించే సదుపాయాల కరపత్రాలను పంపిణీ చేశారు. సరిపల్లి నెంబర్ వన్ పాఠశాల, వెంకట్రాజపురం పాఠశాలలో కూడా ఎన్రోల్మెంట్ డ్రైవ్ కార్యక్రమాన్ని నిర్వహించారు.

## నెలవంక దర్శనం: రంజాన్ వేడుకలకు ముస్తాబైన మండలం

కామవరపుకోట, మార్చి 20(ప్రభాత వార్త): మండలవ్యాప్తంగా శనివారం రంజాన్ పండుగను భక్తిశ్రద్ధలతో జరుపుకోవడానికి ముస్లిం సోదరులు సిద్ధమయ్యారు. శుక్రవారం సాయంత్రం నెలవంక దర్శనమివ్వడంతో నెల రోజుల పవిత్ర ఉపవాస దీక్షలు ముగిశాయి. దీంతో శనివారం ఉదయం మండల కేంద్రంలోని కొత్తూరు జామియా మసీదు,అడమిల్లి,కళ్ళచెరువు పాటు ఆయా గ్రామాల్లోని మసీదుల్లో ప్రత్యేక సామూహిక ప్రార్థనలు నిర్వహించనున్నారు.పండుగను పురస్కరించుకుని మసీదులను సుందరంగా అలంకరించారు. స్థానిక వ్యాపార దుకాణాలు కొనుగోలుదారులతో సందడిగా మారగా, ప్రార్థన స్థలాల వద్ద ఎటువంటి ఇబ్బందులు కలగకుండా పందిళ్లు, తాగునీటి సౌకర్యాలను ఏర్పాటు చేశారు. పేదలకు ఫిత్రా దానాలు అందజేస్తూ, అందరూ కలిసి మెలిసి ఈ పండుగను అత్యంత ఉత్సాహంగా జరుపుకోనున్నారు.

## చెత్త నుండి సంపద కేంద్రంలో చెత్తకు నిప్పు

మొగల్తూరు మార్చి 20 (ప్రభాతవార్త) పశ్చిమగోదావరి జిల్లా మొగల్తూరు మండలం మొగల్తూరు పంచాయతీ పరిధిలో చెత్త నుండి సంపద కేంద్రంలో పంచాయతీ సిబ్బంది నిర్లక్ష్యంగా వ్యవహరిస్తున్న ఘటన లు వెలుగులోకి వచ్చాయి గ్రామాల నుంచి సేకరించిన చెత్తను తడి పొడి వ్యర్థాలుగా విడివిడిగా కేటాయించకుండా ఒకే చోట గుట్టగా వేస్తూ అనంతరం నిప్పు పెడుతున్నట్లు శుక్రవారం స్థానికులు ఆరోపిస్తున్నారు ఈ విధానంతో కేంద్రంలో తరచూ అగ్ని ప్రమాదాలు చోటు చేసుకున్నాయని దాంతో భారీగా పొగలు వ్యాపించి సమీప ప్రాంత ప్రజలు ఇబ్బంది పడుతున్నారు ముఖ్యంగా ప్లాస్టిక్ ఎండిన వ్యర్థాలు కలసి పోవడంతో మంటలు వేగంగా వ్యాపించి ప్రమాదకర పరిస్థితులు ఏర్పడుతున్నాయని దీనిపై ఉ న్నతఅధికారులు వెంటనే స్పందించి చర్యలు తీసుకోవాలని స్థానికులు కోరుకుంటున్నారు



## ఆదిత్య డిగ్రీ కళాశాలలో "ఎక్సవై ఆర్ ఎ" 2కె 26



భీమవరం మర్చి 20 ప్రభాతవార్త : ఆదిత్య డిగ్రీ కళాశాలలో ఎక్సైరా 2K26 టెక్నికల్ ఫెస్ట్ ను ఆదిత్య విద్యా సంస్థల డైరెక్టర్ ఎం శ్రీనివాసరావు ప్రారంభించారు . ఈ కార్యక్రమానికి. ముఖ్య అతిథి గా శ్రీ ఆదిత్య డిగ్రీ కళాశాల ప్రిన్సిపాల్ ఎ అనురాధ పాల్గొన్నారు విద్యార్థులు పోస్టర్ ప్రెజెంటేషన్, పవర్ పాయింట్ ప్రెజెంటేషన్, క్విజ్, క్విక్ ఇంటర్వ్యూ,,డిబేట్ డ్రాయింగ్. ఎ వి క్రియేషన్ అడ్వాన్స్ రీసెర్చ్ ఐడియాస్ అంశాలలో పోటీలలో పాల్గొన్నారు ఈ పోటీలలో విజేతలైన విద్యార్థులకు సర్టిఫికేట్లు మేమేంటోలు అందచేశారు. ఈ కార్యక్రమంలోముఖ్య అతిథి ఎ . అనురాధ మాట్లాడుతూ ఆదిత్య విద్యార్థులు వివిధ అంశాలలో చక్కని ప్రతిభను కనబరిచారని వీరికి మంచి భవిష్యత్తు ఉంటుందని అన్నారు ప్రిన్సిపాల్ కమలాకర్ మాట్లాడుతూ అన్ని విభాగాల్లోనూ ఆధునిక సాంకేతిక సౌకర్యాలతో ఉత్తమ విద్యను అందిస్తున్నామని విద్యార్థులు సాంకేతికతను పెంపొందించుకోవాలని అన్నారు, నూరు శాతం క్యాంపస్ ప్లేసిమెంట్స్ సాధించామని తెలియచేశారు క్యాంపస్ ప్లేస్మెంట్ అధ్యాపకులను సన్మానించారు.విద్యార్థులు వివిధ సంగీత గాన నృత్య సాంస్కృతిక ప్రదర్శనలతో అలరించారు. ఈ కార్యక్రమంలో వైస్ ప్రిన్సిపాల్ కుమారస్వామి యన్.యస్.యస్ పి ఓ.కుమరరాజ ఏ పీ ఓ. కె.శ్రీను అధ్యపక అధ్యాపకేతర సిబ్బంది విద్యార్ధిని విద్యార్థులు పాల్గొన్నారు.

## మహిళా బాక్సింగ్ ఛాంపియన్ పోటీలు ప్రారంభించిన ఎస్ ఆర్ కె నిశాంత్ వర్మ!

భీమవరం మార్చి 20 ప్రభాతవార్త అండర్ 23 మెన్ అండ్ ఉమెన్ బాక్సింగ్ ఓపెన్ ఛాంపియన్ షిప్ పోటీలు ఈనెల 19న భీమవరం ఎస్ ఆర్ కే ఆర్ ఇంజనీరింగ్ కళాశాలలో ఏపీ అమెచూర్ బ్యాక్సింగ్ ఛాంపియన్షిప్ పోటీలు ప్రారంభం అయ్యాయి. అందులో భాగంగా శుక్రవారం ఉమెన్ బాక్సింగ్ పోటీలు ప్రారంభమయ్యాయి. ఈ సందర్భంగా అమేచూర్ బాక్సింగ్ అసోసియేషన్ ఆంధ్రప్రదేశ్ అధ్యక్ష కార్యదర్శులు సాగి రామకృష్ణ నిషాంత వర్మ, కార్యదర్శి బంగారు రాజు మహిళా బాక్సింగ్ పోటీలను ప్రారంభించి అనంతరం మాట్లాడుతూ గోదావరి జిల్లాల్లో యువతకు బాక్సింగ్ క్రీడల్లో కూడా ప్రాధాన్యత కల్పించాలని ఇక్కడ జాతియ స్థాయిలో ఏర్పాటు చేయడం జరిగిందన్నారు. భారతదేశంలో పాటు ఈశాన్య రాష్ట్రాల నుంచి కూడా క్రీడాకారులు వచ్చి బాక్సింగ్ పోటీల్లో పాల్గొనడం యువతలో క్రీడల పట్ల పెరుగుతున్న ఆసక్తికి నిదర్శనంగా పేర్కొన్నారు. ఈ సందర్భంగా జరిగిన కార్యక్రమంలో ఎస్ ఆర్ కే ఆర్ ఇంజనీరింగ్ కళాశాల ప్రిన్సిపల్ డాక్టర్ కె.వి మురళీకృష్ణ రాజు, చీఫ్ అడ్మినిస్ట్రేటివ్ ఆఫీసర్ దిలీప్ చక్రవర్తి తదితరులు పాల్గొన్నారు.




## కూటమిపాలనలో రోడ్లకు మహర్దశ.



లింగపాలెం మండలం మార్చి 20 ప్రభాతవార్త : దశాబ్దాల కాలం నుంచి రంగాపురం శివారు మెట్ట గొల్లగూడెం గ్రామం ఎప్పట్నుంచో ఎదురుచూస్తున్న నూతన రోడ్లు ఈరోజు గౌరవ ముఖ్యమంత్రి గారి ఆదేశాల మేరకు ఈరోజు రంగాపురం గ్రామం మెట్ట గొల్ల గూడెం లో యువ నాయకులు రంగాపురం సర్పంచ్ ముసునూరి రాము గారి ఆధ్వర్యంలో నూతన రోడ్లకు శంకుస్థాపన జరిగింది. సుమారుగా 90 లక్షల రూపాయలు నిధులు ఎంపి , ఎమ్మెల్యే NRGS నిధులు ద్వారా సమకూర్చారు ఈ కార్యక్రమానికి గ్రామ ప్రజలు తెలుగుదేశం పార్టీ కార్యకర్తలు నాయకులు కూటమి కార్యకర్తలు పెద్ద సంఖ్యలో హాజరై ఈ కార్యక్రమాన్ని విజయవంతం చేసినందుకు ధన్యవాదాలు

## భువన విజయ ప్రదర్శన విద్యార్థులకు ప్రశంసలు

భీమవరం మర్చి 20 ప్రభాతవార్త :తెలుగు భాష గొప్పతనం .. తెలుగు ఔన్నత్యాన్ని తెలియపరుస్తూ విద్యార్థులు ప్రదర్శించిన భువన విజయం ప్రదర్శన ను జిల్లా కలెక్టర్ నాగరాణి తోపాటు మిగిలిన అధికారుల ప్రశంసలు అందుకోవడం హర్షించదగ్గ విషయమని భీమవరం ఎంఈవో సాయిరామ్ అన్నారు. భీమవరం జెఎల్ బి హైస్కూల్లో తెలుగుభాషాభివృద్ధి కమిటీ ఆధ్వర్యంలో భువన విజయం ప్రదర్శన చేసిన విద్యార్థులను అభినందించి సత్కరించారు. ఉగాది సందర్భంగా భీమవరం జే ఎల్ బి మున్సిపల్ బాలికొన్నత హైస్కూల్ బాలికలు కలెక్టరేట్ లో భువన విజయం ప్రదర్శన చేశారని, ఈ ప్రదర్శన అందరిని ఆకట్టుకుని అందరి ప్రశంసలను అందుకున్నారని అన్నారు. అనంతరం ప్రదర్శన చేసిన విద్యార్థులను అభినందించి ప్రశంసా పత్రాలను అందించారు. కార్యక్రమంలో కార్యక్రమ నిర్వాహకులు చెరుకువాడ రంగసాయి, రచయిత కలిగొట్ల గోపాలశర్మ, సాహితీవేత్త తెన్నేటి నరసింహా మూర్తి, హెచ్ ఎం కృష్ణ కుమారి, విద్యార్థులు పాల్గొన్నారు.



## రాయలంలో మురిపించిన ముత్యాల ముగ్గులు పోటీలు

భీమవరం మర్చి 20 ప్రభాతవార్త :రంగవల్లులు సంప్రదాయానికి ప్రతీకని పలువురు వక్తలు అన్నారు. భీమవరం మండలం రాయలం గ్రామంలో శ్రీగోగులమ్మ అమ్మవారి 33వ వార్షిక మహోత్సవంలో భాగంగా మహిళలకు రంగవల్లుల పోటీలను నిర్వహించారు. సుమారు 100 మంది మహిళలు రంగవల్లుల పోటీల్లో పాల్గొనగా మొదటి విజేతకు రూ 15 వేలు, ద్వితీయ బహుమతి రూ 10 వేలు, తృతీయ బహుమతి రూ 5 వేలు చొప్పున విజేతలకు బహుమతులు అందజేశారు. మహిళలు రంగువల్లులను అందంగా చుక్కలతో తీర్చిదిద్దారని, చుక్కలతో, సహజ సిద్ధంగా సంస్కృతికి అద్దం పడుతూ ముగ్గులను వేశారని వారిని ఆలయ కమిటీ సభ్యులు అభినందించారు. కార్యక్రమంలో ఆలయ కమిటీ సభ్యులు కలిదిండి రవికుమార్ రాజు, చినిమిల్లి బాబీ, చినిమిల్లి రవి, కోళ్ల సీతారామయ్య, చినిమిల్లి బన్నీ, మెల్ల సత్తులు, గన్నాబత్తుల శ్రీను, కోళ్ల జగపతి, చినిమిల్లి మామజీ, గ్రామస్తులు పత్తి హరివర్ధన్, యర్రంశెట్టి శివకృష్ణ, దారబత్తుల శ్రీనివాస్, కూన శ్రీనివాస్, గార కనకరాజు, కొప్పినీడి భాస్కరరావు, తోట నాగు మహిళలు పాల్గొన్నారు.

